# సంపెంగ కోరిన తుమ్మెద

(కథానిక)

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

రామనాథం యింకో రెండు నెలలకి ఇహ లోకంలోకి వస్తాడనగా అతని తండ్రీ, అతను ఇహలోకంలో మొట్టమొదట ఊపిరి పీల్చిన రెండు నెలలకల్లా అతని తల్లీ, పరలోకయాత్ర చేశారంటే అది అతని తల్లిదండ్రుల దురదృష్టం అని కాని, అతని గ్రహస్థితియొక్క దుష్ఫలితం అని కాని అనడంకన్న అతని కర్మ అనడం సమంజసం.

ఒక చేత్తో బిడ్డని గుండెలకి హత్తుకుని ఏడుస్తూ ప్రాణాలు వదలిన తల్లి చేతిలో రామనాథం రెండునెలల పసి పాపగా ఏడుస్తూ అలాగే ఉండిపోయాడు. ఎవరు దిక్కనే అతనంత ఏడ్చాడో తనని వదలిన తల్లికోసం అతనలాగ విలపించాడో కాని చుట్టూ ఉన్న బంధువుల రోదనలలో ఈ పసిబాలుడి ఏడుపు మిళితమయిపోయి సుమారు ఒక అరగంట తరవాత చనిపోయిన తల్లి సోదరుడు రంగస్వామి రామనాథాన్ని తల్లినుంచి శాశ్వతంగా వేరుచేసి ఊరుకోబెట్టేవరకూ యెవరికీ ఇతని సంగతి అక్కర లేకపోయింది.

రామనాథానికికూడా ఈ దురదృష్ట మహాసముద్రమధ్యంలో దొరకిన నావ ఏమిటంటే రంగస్వామికి పిల్లలు లేకపోవడం. చెల్లెలిమీద అభిమానం కొద్దీనో, రామనాథంమీద జాలి కొద్దీనో గాని రంగస్వామీ, భార్యాకూడా రామనాథాన్ని చాలా గారాబంతోనే పెంచుతూ వచ్చారు. పిల్లలులేని బాధని భగవంతు డీవిధంగా తీర్చాడని వాళ్లు సంతృప్తిపడ్డారు. కాస్త ఆస్తి కలవాళ్లే కనక ఒక దాదినీ, పాలమనిషినీ ఏర్పరచి రామనాథాన్ని చక్కగా పెంచారు.

పరిస్థితు లిలాగే సాగుతూంటే ప్రమాదాలు లేకపోను. కాని రామం (అలాగునే పిల్చేవారు ఇతన్ని) ఆ ఇంట్లో కాలుపెట్టిన నాలుగో ఏట రంగనాథంగారి భార్య గర్భం ధరించింది.

కుర్రవాడు అడుగుపెట్టిన వేళావిశేషం అంది వెర్రిలోకం-ఒకనాడు ఈ కుర్రవాడి తల్లిదండ్రుల మరణానికి ఇతన్నే కారణంగా తీసుకున్న సంగతి వదలిపెట్టి-రంగస్వామిగారుకూడా చాలా సంతోషించారు. సూర్యుడు పశ్చిమాన ఉదయించినంత ఆశ్చర్యం కలుగజేసే ఈ విశేషానికి.

రావలసిన రోజు రాగానే రంగస్వామిగారి భార్య ఓ ఆడపిల్లని కన్నది. కావలసిన లాంఛనాలన్నీ జరిగాయి. ఓ శుభముహూర్తాన్న ఆ అమ్మాయిని సుశీల అని పిలవటం మొదలు పెట్టేరు.

కాని ఒక చిక్కు వచ్చిపడ్డది రంగస్వామిగారు పరిష్కరించాల్సిందిగా. మాటలాడ్డం నేర్చినదగ్గరనించీ రామం రంగస్వామిని నాన్నా అనీ, ఆమెను అమ్మా అనీ పిలిచేవాడు. ఔను మరి! పెంచి ప్రేమించి పెద్దచేసేవారే తల్లితండ్రులని పిల్లలకిమట్టుకూ తెలీదూ? కాని రంగస్వామిగారూ భార్యా ఆలోచించి రామాన్ని ఈపిలుపు మాని తమను 'అత్తమామలు'గా పిలిపించుకోడానికి నిశ్చయించారు. రామం ఎన్నిసార్లు చెప్పినా వాళ్లని 'అమ్మా నాన్నలు'గానే పిలుస్తాడు.

సుశీల పెద్దదయినకొద్దీ రామంమీద పిలుపును గురించిన వత్తిడి హెచ్చుగాసాగి చివరికి జయించింది. రామం వారిని 'అత్తా' అనీ 'మావయ్యా' అనీ పిలువ మొదలుపెట్టాడు. ఆ పిలుపులలో ప్రతిధ్వనిస్తూండే ఎండుదనం, సంకోచం, ఎవరిక్కావాలి?

సుశీల పది వసంతాలు చూచేసరికి రెండు విషయాలు తేలాయి. రామం అందగాడయిన యువకుడనీ, అతని దైహిక సౌందర్యపు కీవిని సుశీల సౌందర్యంకూడా ఓటిమిలేని పోటీ చేస్తుందని.

పదిహేనవ ఏట స్కూల్ ఫైనల్ ప్యాసై రామం కళాశాల విద్యకి పట్టణం పంపబడ్డాడు.

ప్రతి తరగతిలోనూ అతను తెలివైనవాళ్లలో ఒకడుగా ఉండడం చక్కని అతని సౌందర్యం అతనిని అందరికీ ఇష్టుడిగా చేసినై.

రామం మనస్తత్వం చాలా విచిత్రంగా ఉండేది. ఏ పరిస్థితు లెంత తారుమారైనా, ఏ విషయాలు నశించిపోయినా అతని నియమాలు విసర్జింప బడవు-మారవు. ఒక రకమైన పట్టుదలతో అతను ప్రతీ పనినీ చేసేవాడు.

ఈ తత్వమే అతని జీవితంలో అనుకోని సంఘటనలకి దారి చూపింది. అతని వినాశానికి కారణమయింది.

అతను సుశీలని చెల్లెలుగామాత్రమే అత్యంతంగా ప్రేమించాడు. ఆమె శృంగారం ఉట్టిపడేలాగ 'బావా' అని పిలుస్తూంటే అతని వంటినిండా తేళ్లు ప్రాకేవి. ఏదో అసహ్యంవేసేది.

రెండు మూడుసార్లు అత నామెకి చెప్పేడు. తనని అలాగ పిలువవద్దని. ఆమె సమాధానంగా చిరునవ్వు నవ్వి అనేది:

"తప్పేమిటి?"

అతనికి అసహ్యం, కోపం ఎక్కువయేవి.

రామం ఆసంక్రాంతితో ఇరవై ఐదు సంక్రాంతులు చూచాడు. పట్టభద్రుడైన తరువాత ఇంజనీరింగ్ ముగించుకొని రంగస్వామిగారి ఇంటికి వచ్చాడు. నేడో రేపో ఉద్యోగపు వుత్తరవులు వస్తాయి.

ఆనాటి రాత్రి అతను వంటరిగా డాబామీద కూర్చున్నాడు భోంచేసి. సుశీల తమలపాకులు పట్టుకొనివచ్చి ఏదో ప్రేమభాషణ మొదలు పెట్టింది.

రామం మాట్లాడలేదు. అతను ఆమె ప్రవర్తనకి చాలా అసహ్యం, కోపం పొందగలడం కన్నా ఏమీచెయ్యలేడు. సుశీలకి అతని 'వెర్రివాదనలు' నచ్చవు.

జవాబులేని రామంమీద కోపగించి వెళ్లిపోయింది సుశీల. తరువాత ఈ సమస్యా పూరణం ఎలాగని ఆలోచిస్తూ కూర్చున్నాడు రామం. ఆ సమయంలో రంగస్వామిగారు సుశీల వివాహ ప్రస్తావన తెచ్చారు. రామంనిట్టూర్పుతో చెప్పాడు సుశీల తన చెల్లెలనీ మరెవరికైనా ఆమెనిచ్చి పెళ్లిచెయ్యమనీ.

సామంగా చెప్పిచూసి లాభం లేకపోవడం వల్లరంగస్వామిగారుదూషణకిదిగారు. నోరెత్తలేదు రామం.

మర్నాడు అర్డరు వచ్చింది రామానికి. "చిన్నప్పటి నుంచీ పెంచిన మమకారానికి చక్కటి ఉపకారం చేసేవు." ఇంకా ఏమేమో అన్నారు రంగస్వామిగారు. తలయెత్తకుండా ఇల్లు వదలి పెట్టాడు రామం.

ఇదంతా పది సంవత్సరాల క్రితంమాట. నేటికీ, రామం బ్రహ్మచారిగా ఉండిపోయాడు. జీవితాంతంవరకూ అతనంతే. ఇప్పుడతను ఉద్యోగం చేస్తూన్నా, జీతంలో సబ్భై రూపాయలు ఖర్చులకుంచుకొని మిగిలినవి రంగస్వామికి పంపుతూంటాడు. ఆయన అడక్కు పుచ్చుకుంటాడు. లేకకాదు. రామంమీద కసివల్ల. కాని మునిలాగ పవిత్రజీవితం గడిపే రామం బాధఒక్కటే. లోకం తనని అర్థం చేసుకోలేదని.

సుశీల ఈనాడు ముగ్గురు పిల్లల తల్లి. ఆమెకీ పోలేదు అతనిపైకోపం. ఆమె అంటుంది రామం తన నర్థంచేసుకోలేదని. ఆమెకింకా రామంమీద 'మోహం' పోలేదేమో. ఆమె భర్త అంటూంటాడు ఆమె తన నర్థంచేసుకోలేదని.

---

యువకుడు అందమైన పద్యాలు రాసి సంపాదకుడి దగ్గరకు తీసికెళ్ళాడు. సంపాదకుడు పద్యాలు పూర్తిగా చదివి ఆనందం పట్టలేక, "ఎంత చక్కటి కవిత్వం! ఇవి స్వంతంగా మీరే రాశారా?" అన్నాడు.

యువకవి సమాధానం: "అవునండి. కేవలం నా స్వంతమే!"

సంపాదకుడు లేచి నించుని అన్నాడు: "అయితే కవి సార్వభౌమ శ్రీనాథా! నమస్కారం! మిమ్మల్ని చూడగల్గినందుకు కృతజ్ఞుణ్ణి. మీరు అయిదువందల ఏళ్ళ క్రితమే చనిపోయారనే భ్రాంతిలో ఉన్నాను."